



2వ రోజు మహాసభ సందర్భంగా ప్రసంగిస్తున్న ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే

'మహిళల స్థితిగతుల్లో మార్పులేదు'..!

ప్రపంచ వ్యాప్తంగా మహిళల స్థితిగతుల్లో ఎటువంటి మార్పూ ఉండకపోగా మరింత దిగజారుతోందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలోని ఎంకెఎం ఫంక్షన్ హాలులో 16వ ఐద్వా రాష్ట్ర మహాసభ సోమవారం నుంచి ఆరంభమైంది. మంగళవారం రెండో రోజు మహాసభలో సుదీర్ఘ చర్చలు జరిగాయి. ప్రజా, కార్మిక, రైతు సంఘాలు సౌహార్థ సందేశాన్ని విన్పించారు. మహిళల గొప్పతనాన్ని తెలియజేస్తూ రచించిన 'ఎక్కడమ్మా నీవులేనిది' పుస్తకావిష్కరణ చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 'అమ్మకు పట్టాభిషేకం' పేరుతో ప్రదర్శించిన నాటికి ఆకట్టుకుంది.



2వ రోజు జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ప్రతినిధులు

- ◆ ప్రపంచవ్యాప్తంగా 19 మిలియన్ బాలికలు విద్యకు దూరం
- ◆ చట్టసభల్లోనూ తగ్గుతున్న ప్రాధాన్యత
- ◆ ఐద్వా మహాసభలో సుదీర్ఘ చర్చలు
- ◆ 2వ రోజూ ఉత్సాహంగా కొనసాగిన మహాసభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మహాసభల నేపథ్యంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చిన 400 మంది ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. అంతకు మునుపు కార్యదర్శి నివేదికలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రంలో మహిళల స్థితిగతులపై చర్చించారు. ప్రపంచ వ్యాప్తంగానూ మహిళలు అసమానతలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. 19 మిలియన్ బాలికలు యుద్ధాలు, చిన్న వయసులో వివాహాలు వంటి కారణాలతో విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. 85 కోట్ల మంది మహిళల రోజు వారి ఆదాయం వంద రూపాయల్లోపే ఉంటోందన్నారు. చట్టసభల్లోనూ స్త్రీ ప్రాతినిధ్యం తగ్గుతూ వస్తోందన్నారు. భారతదేశ పార్లమెంటులో స్త్రీల ప్రాతినిధ్యం 27 శాతం మాత్రమే ఉందని వివరించారు. ప్రతి ముగ్గురు మహిళల్లో ఒక్కరు జీవితకాలంలో హింసను ఎదుర్కొనక తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అసమానతల్లో నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక కంటే భారత దేశం దిగువన ఉందని చెప్పారు. రాష్ట్రంలోనూ మహిళలపై హింస పెరుగుతోందన్నారు. కనీస వేతనాలు అమలు జరగలేదని చెప్పారు. మద్యం ఏరులై పారిస్తున్నారన్నారు. మద్యం అమ్మకాల్లో బెల్ట్‌షాపుల ద్వారా గ్రామాగ్రామానిక మద్యం చేరుస్తున్నారన్నారు. మైక్రో ఫైనాన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు.

సుదీర్ఘ చర్చలు

కార్యదర్శి నివేదికపై అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. అన్ని జిల్లాల్లోనూ మహిళలు పెద్దఎత్తున సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రధానంగా మైక్రో ఫైనాన్స్ భారినపడిన వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. మద్యం వల్ల నష్టపోతున్న వారు అధికంగా ఉన్నారన్నారు. ఈ సమస్యలపై ఐద్వాగా చేపట్టిన కార్యక్రమాలను అందులో సాధించిన విజయాలను తెలియజేశారు.

మహిళల హక్కులపై మరింత ఉద్యమించాలి
ఐద్వా కార్యదర్శి మరియం ధావలే

మనువాదం ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో మహిళలను జాగృతం చేసి వారి హక్కులను కాపాడటం కోసం ఐద్వా మరింతగా పనిచేయాలని ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే పిలుపునిచ్చారు. మహాసభకు హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే ప్రసంగించారు. రాష్ట్రంలో గడిచిన మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో ఐద్వా చేసిన కృషిని అభినందించారు. ఇదే సందర్భంలో ఈ కృషి ఇంకా సరిపోదని పేర్కొన్నారు. ఐద్వాను మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయాలని దిశానిర్ధేశం చేశారు. ఒకవైపు దేశంలో బిజెపి మతోన్మాదం పెరుగుతుండగా, మనువాదం అమలు చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు. మనువాదం అమలు చేయడమంటే మహిళల హక్కులను హరించివేడయమే అవుతుందని పేర్కొన్నారు. ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం కూడా బిజెపితో కలిసి పనిచేస్తున్న క్రమంలో మరింతగా అప్రమత్తమై ప్రజలను ఐక్యపరిచే విధంగా ఐద్వా కృషి ఉండాలన్నారు. రాష్ట్రంలోనూ అనేక సమస్యలతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా మైక్రో ఫైనాన్స్ వల్ల బాధితులుగా మారుతున్న వారిలో మహిళలు అధికంగా ఉన్నారన్నారు. బాధితుల పక్షాన నిలిచి వారికి అండగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో సంఘం విస్తరణకు చర్యలు తీసుకోవాలని దిశానిర్ధేశం చేశారు.

ఐద్వా పోరాటాలకు సంపూర్ణ మద్దతు

సౌహార్ధ సందేశంలో ప్రజా, రైతు, కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో మహిళల హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐద్వా చేపట్టబోయే భవిష్యత్ పోరాటాలకు తమ వంతు సంపూర్ణ మద్ధతు ఇస్తూ ప్రత్యక్ష్యంగా పోరాటాల్లో పాల్గొంటామని ప్రజా, రైతు, కార్మిక సంఘాల నేతలు తెలియజేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా అనంతపురం నగరంలోని ఎంకెఎం ఫంక్షన్ హాల్ రబియాబి వేదికలో నిర్వహించిన ప్రతినిధుల మహాసభల్లో రైతు, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఆవాజ్ నేతలు హాజరై సౌహార్ధ సందేశం విన్పించారు.

వ్యవసాయం లాభసాటి కోసం రైతాంగాన్ని ఆదుకోవాలి

రాష్ట్రంలో వ్యవసాయం రంగంపై ఆధారపడి ఎక్కువ మంది జీవిస్తున్నారు. పెట్టిన పంటకు గిట్టుబాటు ధరలు లేకుండా పోయాయి. గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వ్యవసాయాన్ని లాభాసాటిగా మార్చడానికి రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమతో ప్రజలు సమాజానికి తోడ్పాడు అందిస్తూ ఉపాధి పొందుతున్నారు. వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. స్థానిక పాడి రైతులను ప్రోత్సహించేలా స్థానిక సొసైటీలకు సహకారం అందించాలి.

హేమలత, రైతు సంఘం రాష్ట్ర నాయకురాలు.

వ్యవసాయ కార్మికుల సంక్షేమ చట్టం అవసరం

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు ఇంటిలోనూ వ్యవసాయంలోనూ సగభాగంగా సేవలందిస్తున్నారు. మహిళలకు సమాన హక్కులు అమలులో మాత్రం వ్యత్యాసం ఉంది. రాష్ట్రంలో అత్యధిక మంది మహిళలు వ్యవసాయం తరువాత ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉపాధి పనులు పూర్తిస్థాయిలో కల్పించడం లేదు. కనీస సౌకర్యాలు తాగునీరు, నీడ, వైద్య మందులు తదితరం ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రావడం లేదు. ఉపాధి భద్రత కల్పించేలా వ్యవసాయ కార్మికులకు సంక్షేమ చట్టం తీసుకురావాలి.

శివనాగరాణి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు.

సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి

మహిళలు అన్ని రంగాల్లో పని చేస్తున్నా వీరికి సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదు. పని ప్రదేశాల్లో మహిళలు హింసకు గురవుతున్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా దాడులు, హత్యలు ఆగడం లేదు. ప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. మహిళలకు రక్షణ చర్యలు తీసుకోవాలి. ఐద్వా పోరాటాలకు సిఐటియు సంపూర్ణంగా నిలిచి పోరాడుతుంది.

రమాదేవి, సిఐటియు రాష్ట్ర నాయకురాలు.

దళితులు, మైనార్టీలపై దాడులు నిర్మూలించాలి

సమాజంలో దళితులు, మైనార్టీలపై దాడులు హత్యలు చోటు చేసుకోవడం దుర్మార్గంగా ఉంది. ప్రభుత్వాలు దళిత పక్షపాతిగా పరిపాలన చేస్తున్నారే తప్పా ఆచరణలో హత్యలు దాడులను మాత్రం నివారించలేకపోతున్నారు. ఇలాంటి చర్యలు సమాజానికి ప్రమాదకరం ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా దాడులు మాత్రం ఆగడం లేదు. దాడులు నిర్మూనకు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది.

ఓ.నల్లప్ప, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు.

ఇంటి నుంచే సమానత్వం ప్రారంభించాలి

మహిళలు, పురుషులన్న లింగ భేదం లేకుండా మన ఇంటి నుంచే సమానత్వం ప్రారంభం కావాలి. అన్ని రంగాలు, సంఘాలలో సభ్యత్వం కల్పిస్తూ సమాజ మార్పునకు సేవలు అందిస్తున్నా వివక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ వివక్షను రూపుమాపాలి. సంఘాలుగా ప్రభుత్వాలను కదలించేందుకు మహిళా సంఘాలు చేపట్టే పోరాటాలకు ఆవాజ్ మద్దతు ఇస్తుంది. ఆవాజ్‌లోనూ మహిళా ప్రతినిధులు తయారు చేసి, వారి హక్కుల సాధానకు పోరాటాలు చేస్తాం.

మహమ్మద్ అబ్దుల్లా చిస్తి, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

ఆకట్టుకున్న 'అమ్మకు పట్టాభిషేకం' నాటిక

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల రెండో రోజు ప్రతినిధుల సభలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లలితకళాపరిషత్ సమర్పణలో దర్శకులు అరుణ్‌బాబు నేతృత్వంలో 'అమ్మకు పట్టాభిషేకం' నాటికను ఎస్‌వి.డిగ్రీ కళాశాల విద్యార్థినులతో నిర్వహించారు. ఈ నాటిక సభికులను ఆకట్టుకుంది. తన బిడ్డ భవిష్యత్ కోసం సర్వం త్యాగం చేసిన ఒక తల్లి.. ఆ తల్లి ఆశయం నెరవేర్చడం కోసం ఆకాశమే హద్దుగా శ్రమించి అమ్మ కలను నెరవేర్చిన కూతూరు.. ఇతివృత్తంతో తల్లీకూతూళ్ల కష్టాలు, పోరాటం.. విజయాన్ని కళ్లకు కట్టినట్లు ఈ నాటిక ద్వారా ప్రదర్శించారు. ఆద్యంతం ఈ నాటికి సభికలను విశేషంగా ఆకట్టుకుంది. నాటిక రచించి, దర్శకత్వం వహించిన అరుణ్‌బాబు, సంగీత దర్శకులు నందకుమార్, నటించిన ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులు, లలితకళాపరిషత్ సమర్పకులకు ప్రతినిధులు అభినందనలు తెలిపారు. రైల్వే పాఠశాల గుంతకల్ విద్యార్థినులు మహిళా చైతన్యం పెంపొందించేలా చేసిన ప్రదర్శన, ఆయా జిల్లాల నుంచి నుంచి మహాసభకు వచ్చిన ప్రతినిధులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలూ అలరించాయి.

చెకుముకి పరీక్షలతో శాస్త్రీయ విజ్ఞానం: జెవివి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

జన విజ్ఞాన వేదిక ప్రతి ఏటా నిర్వహించే చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పట్ల అభిరుచి పెంచడానికి , ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోటీ పరీక్షలను పరిచయం చేయడానికి ఎంతో ఉపయోగపడతాయని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బి నరసారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో మంగళవారం చెకుముకి పరీక్షల గోడపత్రికను విడుదల చేశారు. ఈనెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, నవంబర్ 23న జిల్లాస్థాయి, డిసెంబర్ 12 నుంచి 14 వరకు రాష్ట్ర స్థాయి పరీక్షలు జరుగుతాయని ఆయన చెప్పారు. అన్ని రకాల యాజమాన్యాలకు చెందిన ఉన్నత పాఠశాలల 8,9,10 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. చెకుముకి పరీక్షలు నిర్వహణలో జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలకు సహకరించాలని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఆయా పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్ లు, చెకుముకి పరీక్షల నిర్వహణలో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర విద్యా కమిటీ కన్వీనర్ ఎన్ మహేందర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి తనూజ్, శివారెడ్డి, వీరాస్వామి, రమేష్,వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్, రూరల్

అనుమతులు లేకుండా నిబంధనలు పాటించకుండా టపాసులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ శ్యాం ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తో పాటు ఎస్పీ సతీష్ కుమార్ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దీపావళి పండగ సందర్భంగా టపాసులు విక్రయించే ప్రాంతాల్లో ప్రమాదాలకు తావు లేకుండా సరైన భద్రత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలను టపాసుల విక్రయ దుకాణాల్లో ఉంచరాదని, చట్ట ప్రకారం నిబంధనలను పాటిస్తూ నీరు, ఇసుక తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా టపాసులు విక్రయిస్తే వెంటనే 112 కు డయల్ చేసి సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఆర్డీవోలు తహాశీల్దార్లు పాల్గొన్నారు.

ప్రతి తల్లి, బిడ్డను కాపాడే బాధ్యత తీసుకోవాలి

ప్రతి తల్లి బిడ్డను కాపాడే బాధ్యత అందరి పైన ఉందని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా వైద్య అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫిరోజ్ బేగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వడీఎంహెచ్ఓ మాట్లాడుతూ, ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ఒక తల్లి ఒక బిడ్డ మరణించారని తెలిపారు. మాతృ మరణాలకు సంబంధించిన అన్ని విషయాలపై సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా ప్రమాద హెచ్చరికలు ప్రభావం కలిగిన గర్భిణినిముందుగానే గుర్తించి పర్యవేక్షక సిబ్బంది నిఘా పెట్టీ ప్రతి తల్లి, బిడ్డను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ కెఎన్.విజయలక్ష్మి, డిఐఒ డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ బాబాబుడెన్, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న వాల్మీకిసంఘం నాయకులు

'మోడీ.. మాట నిలుపుకో'.. !

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రధాని నరేంద్ర మోడీ వాల్మీకి కులస్తులకు ఇచ్చిన మాట నెలబెట్టుకోవాలని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ కర్నూల్ జిల్లా సాక్షిగా వాల్మీకి బోయల సమస్యలను అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అయితే ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారని అన్నారు. ప్రస్తుతం కర్నూలు జిల్లా పర్యటన నిమిత్తం 16న వస్తున్న సందర్భంగా వాల్మీకి బోయలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నా మన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి ఎస్ ఎస్ నాయకులు యం. శ్రవణ్ మూర్తి, దొనికొండ ఆనంద్, మేకల శివప్రసాద్,అంజనదేవి, కుర్లపల్లి మోహన్ ముద్దుల చిన్న నరసింహులు ప్రమీల, శాంతమ్మ,సురేష్, అశోక్, నాగేశ్వరి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని అందుకోసం ఈనెల 15న చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యాలయంలో మీడియా తో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి జరుగుతున్న ఈ సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని వారి పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొంటుందని చెప్పారు. విద్యుత్ కార్మికులందరూ ఐక్యంగా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జేఎల్ఎం గ్రేడ్-2ఉద్యోగులకి ఏపీఎస్ఐబి సర్వీస్ రూల్స్‌ను వర్తింపచేసి ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు 4 పెండింగ్ డిఎలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్ సి కమిటీని వేసి ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరినీ ఒకే క్యాడర్ గా గుర్తించి ఒకే రకమైన వేతనం ఇవ్వాలన్నారు, 22 పీఆర్సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులందరినీ అన్ లిమిటెడ్ వైద్య సౌకర్యం కల్పించి కోటి రూపాయలు ఇన్సూరెన్స్ పథకం వర్తింపజేయాలని రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జన్‌కో ట్రాన్స్‌కో డిస్కంలో ప్రైవేటీకరణ విధానాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

సీనియర్ న్యాయవాది మృతికి సంతాపం

ప్రజాశక్తి-హిందూపురం

సీనియర్ న్యాయవాది పి. నాగభూషణరావు (73) మృతికి న్యాయమూర్తులు సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగభూషణ్ రావు చికిత్స పొందుతూ బెంగళూరులో మృతి చెందారు. మృతదేహాన్ని ఇక్కడికి తీసుకురాగా న్యాయమూర్తులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వన్నేరువప్ప, రామచంద్రప్పల ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, జూనియర్ సివిల్ జడ్జిలు అశోక్ కుమార్, లలిత లక్ష్మీ హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య తదితరులు నాగభూషణరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను విమర్శించే స్థాయి ప్రకాష్‌రెడ్డికి లేదు : కందికుంట



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

వైసీపీ హయాంలో హౌసింగ్ కార్పొరేషన్ పేరుతో స్కాం లు చేసిన ఘనత రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిదని ఆయనకు ఎమ్మెల్యేలను విమర్శించే స్థాయి లేదని కదిరి ఎమ్మెల్యే కంది కుంట వెంకట ప్రసాద్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట మాట్లాడారు. ప్రకాష్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. పేరూరు కి నీరు తీసుకువచ్చింది, మాజీ ముఖ్యమంత్రి ఎన్ టి ఆర్, ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అని తెలుసుకోవాలని సూచించారు. ప్రకాష్‌రెడ్డి విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి పరిటాల రవీంద్ర గురించి విచక్షణ కోల్పోయి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమం కోసమే రాజకీయాలలోకి వచ్చామన్నది తెలుసుకోవాలన్నారు. తండ్రి పేరును వాడుకుంటూ రాజకీయాలు చేస్తున్న చరిత్ర ప్రకాష్‌రెడ్డిది అని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్ డి బి నుంచి వచ్చిన నిధులతో ఒక్క రోడ్డు ను పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా అడ్డగోలుగా ఆరోపణలు చేయడం తగదన్నారు. టిడిపి ఎమ్మెల్యేలను విమర్శిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ రాజశేఖర్ ఆచారి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఎస్సీ, ఎస్ టి, బిసి, మైనార్టీలు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలతో చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందాలని పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక షాదీ మహల్‌లో సబ్సిడీ రుణాలు చిన్న పరిశ్రమల స్థాపన పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బహుజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ, సంబంధిత నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్న పరిశ్రమల స్థాపనకు ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ వర్గాలవారికి సబ్సిడీ రుణాలు అందించేందుకు ప్రభుత్వం ముందుకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బహుజన సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి
www.prajasakti.com



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలో కొడపగానిపల్లిలో పుట్టపర్తి డి.ఎస్.పి విజయకుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై నేరాల విషయంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు వారి మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. రోజురోజుకు ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అమ్మాయిలు ఒంటరిగా బయటకు వెళ్లినప్పుడు ఎవరైనా ఆకతాయిలు వెంటపడితే వెంటనే 100కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి పుట్టపర్తి, బుక్కపట్నం , కొత్తచెరువు పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ- 1 రైతు సేవ కేంద్రంలో రైతు సేవా కేంద్రం అధికారులకు వ్యవసాయ విస్తరణ అధికారులకు నందు పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఒ వీర నరేష్, ఎఎస్ఒ భార్గవి మాట్లాడుతూ ఖరీఫ్ - 2025 కు సంబంధించిన ఈ పంట ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పంటవేసి ఇంకా నమోదు చేసుకోని రైతులు అక్టోబర్ 20వ తారీకు లోపు రైతు సేవ కేంద్రం అధికారితో నమోదు చేయించుకోవాలని సూచించారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ సహాయకులు కు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి సయ్యద్ షాదాబ్ తెలిపారు ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రణాళిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయక గణాంక అధికారి నరేంద్ర, ఎఇఒలు భరణి, రాజేష్, ఫిరోజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని బూదిలి గ్రామంలో నూతనంగా చేపడుతున్న వాల్మీకి దేవాలయ అభివృద్ధికి విరాళం అందజేశారు. పాలసముద్రం సింగల్ విండో అధ్యక్షులు బెల్లాల చెరువు చంద్ర 10వేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో బూదిలి సర్పంచి ఆంజనేయులు, మాజీ సర్పంచి నరేష్, సింగల్ విండో అధ్యక్షులు రమణ, మాజీ ఎంపిటిసి నరసింహులు, శంకర తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణానికి చెందిన గౌరీ శంకర్ అనే భవన నిర్మాణ కార్మికుడికి ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఒక చేయి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు సందా రాఘవ మంగళవారం గాయపడిన కార్మికుడికి ఆర్థికసాయం అందజేశారు. తనవంతు సాయంగా పదివేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జింకా పురుషోత్తం, సాయికృష్ణ, బేల్దారి మురళి, బిల్డర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం మెయిన్ బజార్, తేరువీధి, తదితర ప్రాంతాలలో గత రెండు రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అనునిత్యం రద్దీగా ఉండే మెయిన్ బజార్, తేరు బజారు తదితర ప్రాంతాలలో రెండు రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్థానికులు మాట్లాడుతూ తమ వీధిలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారంగా మారిందన్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు బయటికి రావాలంటే తప్పనిసరిగా టార్చ్ లైట్ తీసుకొని బయటికి వస్తున్నారనీ, ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధి దీపాలు వెలిగేలా సత్వర చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జీఎస్టీపై అవగాహన

ప్రజాశక్తి - పరిగి

జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి అన్నారు. పరిగి మండల కేంద్రంలోని సచివాలయంలో జీఎస్టీపై అవగాహన సదస్సును మండల అధికారులు నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హసీనా సుల్తానా, పరిగి వేణుగోపాలరావు, ఇఒఆర్డి విజయభాస్కర్, ఎంఈఓ లక్ష్మీదేవి, పిఆర్ ఇంజనీర్ నాగప్ప, మండల అభివృద్ధి కమిటీ నాయకులు వెంకటేష్ సంజీవరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై స్థానిక ఎంపీడీవో, సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళశారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలో వ్యాపారస్తులు తగ్గిన రెట్లతోనే అమ్మకాలు జరపాలని, లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు, ఏఓ నరసింగరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఆలయ స్థల వివాదం



ఆలయ స్థలంలో ఉంచిన కట్టెలు, మట్టి కుప్పలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలోని సజ్జగంట రంగనాథ స్వామి దేవాలయానికి చెందిన స్థల వివాదం పోలీసుస్టేషన్‌కు చేరింది. సర్వే నెంబర్27-11 లో స్థలంలో దేవాలయానికి సంబంధించిన కోనేరు స్థలం ఉందని ఆ స్థలాన్ని గ్రామంలోనిఒక కుటుంబానికి చెందిన వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని గ్రామస్తులు గతంలో తహశీల్దార్, దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో దేవాదాయ అధికారి సంబంధిత స్థలం గుడికి సంబంధించినదని బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అయితే అక్రమ దారుడు తన రాజకీయ బలంతో బోర్డు కూడా తొలగించాడని నాలుగు నెలల క్రితం గ్రామస్తులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఆలయ భూమికి సంబంధించి హద్దులు ఏర్పాటు చేయాలని దేవాదాయ అధికారులకు సూచించారు. అయితే ఆ శాఖ అధికారులు స్పందించకపోవడంతో ప్రస్తుతం అక్రమదారుడు దేవాదాయ కోనేరు స్థలంలో కట్టెలు, మట్టి వేస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఆక్రమణదారుడు గ్రామస్తులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన పోలీస్ అధికారులు సంబంధిత స్థలం గుడికి సంబంధించినట్లుగా ఆధారాలు ఉన్నాయని దేవాదాయ భూములు ఎవరు ఆక్రమణ చేసినా చట్టరీత్యా నేరమని అక్రమదారుడికి చెప్పారు. అయితే ఆలయ స్థల వివాదం ఇంత జరుగుతున్నా దేవాదాయ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ ఉన్నత అధికారులు స్పందించి శ్రీ సజ్జగంట రంగనాథ స్వామి కోనేరు స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కావేరి రకం మొక్కజొన్నతో లాభాలు

ప్రజాశక్తి రొద్దం

కావేరీ కంపెనీ మొక్క.జొన్నవిత్తనాలతో అధిక దిగుబడి వస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం మండలంలోని బిదానపల్లి గ్రామంలో రైతు అశ్వర్థప్ప మండల కేంద్రంలోని దుర్గా మల్లేశ్వర ఏజెన్సీ నిర్వాహకుడు లింగప్ప వద్ద నుంచి దాదాపు కావేరి రోలక్స్ 8577 అనే రకం ఐబ్రీడ్ మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి 6 ఎకరాల్లో పంట సాగు చేశాడు. ప్రస్తుతం దిగుబడి ఎకరానికి 40 నుంచి 50 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉందని రైతు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ నిర్వాహకుడు, కావేరి కంపెనీ అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మురళి మంగళవారం రైతు పంటపొలాన్ని పరిశీలించారు. మొక్కజొన్న కంకులను తీసుకుని ఆ గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ కావేరి రిలాక్స్ 8577 రకం విత్తనాలు వర్షాలకు, ఎండకు తట్టుకొని అధిక దిగుబడి ఇస్తున్నాయన్నారు. తమ కంపెనీ విత్తనాల ప్రాధాన్యతను వారు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రైతులు, కావేరి కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు, ఏజెన్సీ నిర్వాహకుడు లింగప్ప తదితరులు పాల్గొన్నారు.



కావేరి రకం మొక్కజొన్న విత్తనాల నాణ్యత గురించి వివరిస్తున్నకంపెనీ ప్రతినిధులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బలవంతపు భూసేకరణ ఆపాలి

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల పరిధిలోని మరికొమ్మదిన్నె, వెలిచెలమల పంచాయతీలలోని అటవీ ప్రాంతాలలో సర్వే లు ఆపాలని జిల్లా ఏపీ రైతు సంఘం నాయకులు రమణయ్య, కేకే రాజారెడ్డి, సిపిఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం రెవెన్యూ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ షేక్ షా కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు తెలియజేయకుండా ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూములు సర్వే చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలన్నారు. రైతులకు అన్యాయం జరిగితే ఎపి రైతు సంఘం పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రామ్మోహన్, గంగిరెడ్డి, సిఐటియు నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరిరైతును ఆదుకోవాలి : సిపిఎం



తెగులు సోకిన వరిపంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల పరిధిలోని పి. కొత్తపల్లిలో చీడపీడలతో దెబ్బతిన్న వరి పంట పొలాన్ని పరిశీలించిన సిపిఎం నాయకులు బాధిత రైతును ఆదుకోవలని డిమాండ్ చేశారు. గ్రామంలోని రైతు నరసింహులు సాగు చేసిన వరిపంట పొలాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రమణయ్య, కేకే రాజారెడ్డి తదితరులు సిపిం మండల నాయకులతో కలసి మంగళవారం పరిశీలించారు. పంటకు ఉపయోగించిన మందులతోనే పంట మొత్తం నాశనం అయిందని బాధిత రైతు నాయకుల వద్ద వాపోయాడ. వరి పంట నష్టానికి గురిచేసిన ఖాసిం పీరా ఫర్టిలైజర్స్ దుకాణంపై తనిఖీలు నిర్వహించి దుకాణాన్ని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ దుకాణంనుంచి విత్తనాలు, మందులు కొనుగోలు చేశానని పంట సాగు సమయంలో వారు చెప్పిన విధంగానే మెలకువను పాటించి పంట సాగు చేశానని చెప్పాడు. పంట ఏపుగా పెరుగుతున్న సమయంలో వరి పంటలో తెల్లచీడ నివారణకై మందులు కొనుగోలు చేయడానికి వెళితే నకిలీ మందులు ఇచ్చి తన పంట సర్వం కోల్పోయేలా చేశాడని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వరి పంట దెబ్బతిన్న విషయాన్ని ఫర్టిలైజర్స్ యజమాని దృష్టికి తీసుకురాగా 'తన మందులు నకిలీ కావని.. నీ ఇష్టం ఉన్నచోట చెప్పుకోపో' అని తనను దబాయించినట్లు రైతు నరసింహులు వాపోయాడు. ఈసందర్భంగా రైతు సమస్యను మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. వరి పంట దెబ్బతిన్న విషయాన్ని తమ పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి రైతుకు న్యాయం జరిగే విధంగా చూస్తామని ఎఒ లోకేశ్వర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గంగిరెడ్డి, రామ్మోహన్, సిఐటియు నాయకులు నాగరాజు , రైతులు ఇరగం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై కళాజాత

ప్రజాశక్తి - రొద్దం



కళాజాతాను తిలకిస్తున్న గ్రామస్తులు

పారిశుధ్యంపై మండలంలోని చోలేమర్రి గ్రామంలో అధికారులు కళాజాతాను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంటింటి చెత్త సేకరణ గురించి అవగాహనా కల్పించారు. అదే విధంగా ఇంటి పన్ను, పరిసరాల పరిశుభ్రత, సింగిల్ యూనిట్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధం, ఆరోగ్యం, దోమల నివారణ, మొక్కలు పెంపకం , వ్యక్తిగత పరిశుభ్రత, తదితర వాటిపై నాటిక రూపంలో అవగాహన కల్పించి ప్రజలలో చైతన్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్ కుమార్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో 'పిసిఎంఆర్' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభా విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం రూరల్ : 69వ స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయిలో అనంతపురం ఆర్ డి టి ఇండోర్ స్టేడియం లో జరిగిన (రెజ్లింగ్) కుస్తీ పోటీలలో స్థానిక పిసిఎంఆర్ విద్యార్థులు తమ సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఆ పాఠశాల ఛైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో వీరు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రూప్‌రాజా కృష్ణ, జగదీష్. కరస్పాండెంట్ నాగమోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్ కుమార్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతిభా విద్యార్థులను అభినందించారు.

కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

తమ పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదని వైసిపి మండల కన్వీనర్ రాము అన్నారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి సూచనల మేరకు హిందూపురం రూరల్ మండల కన్వీనర్ రాము ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ గోడపత్రికలను ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసిపికార్యకర్తలు పడే కష్టాలను, బాధలను ఈ డిజిటల్ బుక్ లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాస్ రెడ్డి , ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్య మోహన్, నియోజకవర్గ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు అమీర్ ఖాన్, నాగరాజు, నంజీ రెడ్డి, లోకేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అందరూ సహకరించాలని అధికారులు కోరారు. మంగళవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి వెంకట రమణ, ఎంపీడీవో ఆనంద్ ప్రసాద్, సర్పంచి రత్నమ్మ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇంజినీర్ హనుమే నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ వేణు, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, ఏఈ నారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, ఫీల్డ్ అసిస్టెంట్, హరిత రాయబారులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఫోనెక్స్ గ్లోబల్ స్కూలుపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో విద్యార్థి సంఘాల నాయకులు పోతలయ్య, మంజుల నరేంద్ర తదితరులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలు పాటించని ఫోనెక్స్ గ్లోబల్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు పలుమార్లు విన్నవించుకున్న జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం లేదని విమర్శించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు చేపట్టిందనిపాఠశాల ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్న పాఠశాలకు ఎటువంటి గుర్తింపు లభించలేదని అన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు యూడిఐఎస్ కూడా లేదని ఇక్కడి విద్యార్థులకు రాజమహేంద్రవరంలోని పాఠశాలలో అడ్మిషన్లను యుడిఐసిలో నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఈ విధంగా కొనసాగితే విద్యార్థులు భవిష్యత్తులో ఇబ్బందులు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలకు ప్రభుత్వ అనుమతులు లేనందున జిల్లా విద్యాశాఖాధికారి, కలెక్టర్ స్పందించి పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయవర్ధన్, నవీన్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన బత్తలపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

జాన్సన్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ ఉత్సవ్2025 లో భాగంగా ఈనెల 12న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రతిభా ఫైనల్ పోటీల్లో బత్తలపల్లి మండలంలోని శ్రీ జ్యోతి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ఎం. ధరణి సేవ్ గర్ల్స్ ఛైల్డ్, చరణ్ సేవ్ బాయ్స్ ఛైల్డ్ అనే అంశాలపై ఆంగ్లంలో చేసిన ప్రేరణాత్మక ప్రసంగాలతో విజేతలుగా నిలిచారు. విజేతలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. ఈ నేపథ్యంలో ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు మంగళవారం శ్రీ జ్యోతి హైస్కూల్‌ను సందర్శించి ప్రతిభా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకులేటి వీరనారప్ప, శ్రీ జ్యోతి స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, తేజ, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు .



విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందిస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు

యువకుల మధ్య ఘర్షణ

వేర్వేరు ఘటనలో ఇద్దరు మృతి

కర్నాటకలో కేసు నమోదు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన కొంతమంది యువకులు పట్టణ సమీపంలోని కర్ణాటక రాష్ట్రం మదిగిరి తాలూకా జలదిమ్మనహళ్లి (వంకాయల గేటు) వద్ద మద్యం తాగడానికి వెళ్లిన వేర్వేరు ఘటనలో ఇద్దరు మృతిచెందిన ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. అందుకు సంబందించిన వివరాలు... నాలుగు రోజుల క్రితం పట్టణంలోని సూగూరు ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు కలిసి మద్యం తాగడానికి కర్నాటక ప్రాంతానికి చెందిన వంకాయల గేటు వద్దకు వెళ్లారు. మద్యం తాగే సమయంలో వారి మధ్య చిన్న తగాదా వచ్చింది. దీంతో పవన్ కళ్యాణ్ అనే యువకుడిని మరో యువకుడు బ్యాటుతో తలకు కొట్టాడు. దీంతో చిన్న గాయం అయింది. మద్యం మత్తులో అతనికి నొప్పి కనిపించలేదు. మద్యం మత్తు దిగిన అనంతరం సోమవారం తలనొప్పి అంటూ హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళాడు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు వెంటనే బెంగళూరుకు వెళ్లాలని సూచించారు. అక్కడ వైద్యం పొందుతూ సోమవారం రాత్రి వపన్‌కళ్యాణ్ అనే యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనపై కర్నాటక రాష్ట్రం కోడిగేని హళ్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అదేవిధంగా ఆదివారం పట్టణంలోని రహమత్ పురం ప్రాంతానికి చెందిన నూర్ మొహమ్మద్, నూరు, వాజిద్ అనే ముగ్గురు స్నేహితులు ద్విచక్ర వాహనంలో మద్యంతాగడానికి వంకాయల గేటు వద్దకు వెళ్లారు. వీరికి మరో యువకుడు అక్కడ కలిశాడు. నలుగురు చేరి మద్యం తాగుతూ గొడవపడ్డారు. ఈ గొడవలో మిగిలిన యువకులు నూర్ మొహమ్మద్‌పై దాడికి దిగారు. మద్యం బాటిల్‌తో తలకు కొట్టటంతో రక్తస్రావం జరిగింది. వెంటనే అతడిని హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. వైద్య సేవలు పొందుతూ సోమవారం రాత్రి నూర్ మొహమ్మద్ మృతి చెందాడు. వరుసగా వంకాయల గేటు వద్ద ఉన్న మద్యం దుకాణాల వద్ద గొడవలు జరగడం, ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం తెలుసుకున్న తుంకూరు జిల్లా అదనపు ఎస్పీ, మధుగిరి సీఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గొడవలకు గల కారణాలను తెలుసుకున్నారు. ఈ రెండు ఘటనలపై కర్నాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని సంజీవయ్య నగర్‌లో నివాసం ఉండే శాంతమ్మ కుమార్తె రేవతి(38) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. శాంతమ్మ కుమార్తె దండగల రేవతిని ఓబుల దేవర చెరువు మండలం మలక వారి పల్లిలోని యువకుడికి ఇచ్చి పెళ్లి చేశారు. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రేవతి సంవత్సర కాలంగా మానసికంగా ఇబ్బంది పడుతుండేది. ఈ నేపథ్యంలో శాంతమ్మ సోమవారం తన కూతురును ఒడిసి నుండి తనకల్లు స్వగ్రామానికి వైద్యం నిమిత్తం పిలుచుకుని వచ్చింది. మానసిక స్థితి సరిగా లేని రేవతి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే రేవతి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నల్లచెరువు ఎస్ఐ మక్బూల్ తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల పరిధిలో బత్తినిగారిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినటుల ఎస్ఐ వలిబాషా తెలిపారు. ఈసందర్భంగా వారి వద్ద నుంచి రూ.6005లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు మౌలా తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం తయారు చేస్తే పీడీ యాక్ట్

ప్రజాశక్తి-హిందూపురం

కల్తీ మద్యాన్ని తయారుచేసినా, నిలువ ఉంచిన అలాంటి వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య హెచ్చరించారు. మంగళవారం హిందూపురం పట్టణంలో ఉన్న మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తనిఖీ చేశారు. వారు అమ్ముతున్న మద్యాన్ని శాంపిల్స్ సేకరించారు. అదేవిధంగా చిలమత్తూరు మండలంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టారు. మద్యం దుకాణదారులు, బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు కల్తీ మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారిపై శాఖ పరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. చిలమత్తూరు మండల పరిధిలోని మొరసలపల్లి క్రాస్ వద్ద ఒక వ్యక్తి నుండి కర్నాటక రాష్ట్రానికి చెందిన హై వర్డ్స్ 48 టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకొని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కోడూరు తోపు వద్ద లైసెన్స్ లేని వ్యక్తి నుంచి పది లీటర్ల కల్లును సీజ్ చేసి వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్స్ నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుల్స్ అంజి, రవీంద్ర, కుమార్, రంగధామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నట్లు వివరించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-హిందూపురం



బాధితుడికి సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాధితుడికి ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకుంది ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసముంటున్న బిలాల్ అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుసుకున్న ట్రస్టు ప్రతినిధులు మంగళవారం బాధితుడికి కలిసి రూ.18 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు ఎం.డి.ఎస్. అమన్, ట్రస్ట్ కార్యదర్శి ఉమర్ ఫరూక్, రక్తదాతల నిధి అధ్యక్షులు సాదిక్, కోశాధికారి అర్ఫాత్, సభ్యులు రిహాన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి పడిపోయిన విషయాన్ని గమనించిన అక్కడున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆ వ్యక్తిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే ఆ వ్యక్తి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోలీసులు ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతునివివరాలు తెలిస్తే వన్ టౌన్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని సిఐ రాజగోపాల్ నాయుడు కోరారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -గోరంట్ల



నోటుపుస్తకాలతో విద్యార్థులు

మండలంలోని నర్సంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బెంగళూరుకు చెందిన గాయత్రి సిల్క్ సౌజన్యంతో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గోపాల్, ఉపాధ్యాయులు సూర్య నారాయణ రెడ్డి, సుధాకర్, ఆదినారాయణ, దామోదర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, డి శ్రీనివాసులు, స్కూల్ కమిటీ చైర్మన్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.